సాక్షి అనకాపల్లి

బుధవారం । 23 । ఆగస్టు । 2023

వైశ్యరాజు జ్యూయలర్స్
శ్రావణమాసం ఆఫర్
Offer is Valid Last 2 Days Only*
GOLD RATE on 22KT(916) ₹ 5190 /gm ON SPOT PURCHASES ONLY*
వెండి వస్తువులపై NO తరుగు మజూరి GST (WE WILL PAY) ON REGULAR ARTICLES
All Branches | Ph : 74 6999 6999

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

తుమ్మపాల: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.అనంతలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. యలమంచిలి ఐసీడీఎస్ పరిధిలో ఒకటి, గొలుగొండ పరిధిలో రెండు అంగన్‌వాడీ కార్యకర్తలు, యలమంచిలి-9, సబ్బవరం, గొలుగొండ, రావికమతం పరిధిల్లో 5 చొప్పున, అనకాపల్లి, నక్కపల్లి పరిధిల్లో 3 చొప్పున, వి.మాడుగుల పరిధిలో 2 మొత్తం 32 ఆయా పోస్టులకు అర్హత గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్లలోపు వయసున్న, పదోతరగతి ఉత్తీర్ణులైన స్థానిక, వివాహితలు అర్హులన్నారు. వితంతువులు, అనాథలు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు అన్ని ధ్రువపత్రాలు జతపరిచిన దరఖాస్తులను ఈ నెల 29లోగా సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి అందించాలన్నారు. అర్హులైన వారికి కాల్ లెటర్ పంపిస్తామని, అందులో పేర్కొన్న తేదీనాడు నిర్దేశిత ప్రదేశంలో జరిగే ఎంపిక ఇంటర్వ్యూకు హాజరు కావాల్సిందిగా సూచించారు. వివరాలకు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ మహిళా క్రికెట్ అంపైర్‌గా వేణుమాధవ్


కేఎస్‌వీపీ వేణుమాధవ్

అనకాపల్లిటౌన్: పట్టణానికి చెందిన క్రికెటర్ కేఎస్‌వీపీ వేణుమాధవ్ అంతర్జాతీయ మహిళా క్రికెట్ మ్యాచ్‌కు అంపైర్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 26న సింగపూర్-మయన్మార్ మహిళా జట్ల మధ్య జరిగే క్రికెట్ మ్యాచ్‌కు ఆయన అంపైర్‌గా వ్యవహరించనున్నారు. వేణుమాధవ్ ఎంపిక పట్ల స్థానిక క్రికెట్ అభిమానులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈయన సౌత్ ఏషియన్ ఒలింపిక్స్ క్రికెట్ మ్యాచ్‌ల స్కోరర్‌గా పని చేశారు.

స్వల్ప వర్ష సూచన

అనకాపల్లి టౌన్: రాగల నాలుగు రోజుల్లో స్వల్ప వర్షసూచన ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం తెలిపారు. 23న 8, 24న 2, 26న 2, 27న 4 మి.మీ. చొప్పున వర్షపాతం, 33.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్‌కు సాయి కౌశిక్



విశాఖ స్పోర్ట్స్ : జాతీయ స్థాయి ఎయిర్ రైఫిల్ షూటింగ్ పోటీలకు విశాఖ కుర్రాడు సాయి కౌశిక్ అర్హత సాధించాడు. ఈ పోటీలు నవంబర్‌లో భోపాల్‌లో జరగనున్నాయి. ఇటీవల కేరళలో జరిగిన అండర్ 16 సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఏపీ తరుఫున పాల్గొని 400 పాయింట్లకు 383 పాయింట్లతో నిలిచాడు. ఎయిర్ రైఫిల్ షూటింగ్ 10 మీటర్ల సబ్ యూత్ మెన్ విభాగంలో తలపడి పదో ర్యాంక్‌లో నిలిచి అర్హత సాధించాడు.

సమస్యలపై సమగ్ర చర్చ

- ఆర్బీకేలు లేని చోట అందుబాటులో ఎరువులు
- రోడ్లకు సత్వరమే మరమ్మతులు
- జెడ్పీ సమావేశానికి హాజరైన మంత్రులు బూడి, గుడివాడ


మాట్లాడుతున్న గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్




జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, వేదికపై మంత్రి అమర్‌నాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, కలెక్టర్లు రవి పట్టాన్‌శెట్టి, మల్లికార్జున, సుమిత్‌కుమార్ (పైన) సమావేశానికి హాజరైన సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. వాటికి సంబంధిత అధికారులు సమాధానాలిచ్చారు. మంగళవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. రోడ్లు, భవనాలు, వ్యవసాయం, వైద్యం, ఆరోగ్యం, జలవనరులు తదితర శాఖలకు సంబంధించి సభ్యులు పలు విషయాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు ఎ.మల్లికార్జున, రవి పట్టాన్‌శెట్టి, సుమిత్‌కుమార్‌లు హాజరయ్యారు. తొలుత రోడ్లు భవనాల శాఖపై చర్చ జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్లను మెరుగుపరచాలని, రోడ్ల వెంబడి చెట్ల కొమ్మలు పెరిగిపోయి వాహనాలకు ఇబ్బందికరంగా మారాయని, ఇటీవల ఘాట్‌రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదానికి చెట్ల కొమ్మలు కారణమయ్యాయని అనంతగిరి, చింతపల్లి, అరకు జెడ్పీటీసీలు గంగరాజు, పోతరాజు, రోషిణిలు తెలిపారు. దీనిపై ఆర్‌అండ్‌బీ అధికారులు సమాధానమిస్తూ రోడ్ల మరమ్మతులు చేపడతామని, చెట్ల కొమ్మలు తొలగిస్తామని చెప్పారు. భీమిలి-నర్సీపట్నం రోడ్డు వెంబడి ప్రైవేటు స్థలాల్లో చెట్లను కాంట్రాక్టరు నరికిస్తున్నారని బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు స్పందిస్తూ ప్రభుత్వం జరిపిస్తున్న రీసర్వేలో రోడ్ల వెంబడి ఆక్రమణలు తేటతెల్లమవుతాయని, సరిహద్దులు నిర్ణయించాక ఆక్రమణలను తొలగించాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. తంతడి-అనకాపల్లి రోడ్డు బాగులేక ప్రమాదాలు జరగుతున్నాయని, దానిని బాగు చేయాలని పరవాడ జెడ్పీటీసీ, మునగపాక-అనకాపల్లి రోడ్ల విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు.

అనకాపల్లి జిల్లాలో 20 శాతం లోటు వర్షపాతం ఉందని, 15 మండలాల్లో వరి నాట్లు వేసే పరిస్థితి లేదని, దీంతో 8,800 హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళిక రూపొందించామని, ఎరువులకు కొరత లేదని ఆ జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు తెలిపారు. ఆర్బీకేలు నిర్మాణంలో ఉన్న గ్రామాల్లో ఎరువుల నిల్వలకు వీలు కాలేదని, అలాంటి చోట్ల పీఏసీఎస్‌లలో వాటిని అందుబాటులో ఉంచాలని ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు ఆదేశించారు.

అల్లూరి జిల్లాలో కొండపోడు సాగుకు ట్రాక్టర్లు పనికిరావని, అందువల్ల ఎద్దులను ఇవ్వాలని, పీటీజీలకు నెలకు 50 కిలోల బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలని కొయ్యూరు జెడ్పీటీసీ నూకరాజు కోరారు. డీఫారం పట్టా భూములకు రుణాలివ్వడం, రెన్యూవల్ చేయడం లేదని కొందరు జెడ్పీటీసీలు ఫిర్యాదు చేశారు. దీనిపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో సదరం సర్టిఫికెట్ల జారీలో వైకల్య పర్సంటేజీలో తాత్కాలికం అని పేర్కొనడం వల్ల పలువురు దివ్యాంగులు పెన్షన్లకు నోచుకోవడం లేదని సభ్యులు సభలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని అనకాపల్లి కలెక్టర్ తెలిపారు. అనకాపల్లి మండలంలో క్వారీలున్న గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని అనకాపల్లి ఎంపీపీ సూరిబాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి స్పందిస్తూ ఆ గ్రామాల్లో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, వైద్యారోగ్య శాఖ పీసీబీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కమిటీ వేసి దీనికి కారణాలను తేల్చాలని ఆదేశించారు. 108 అంబులెన్సుల్లో గర్భిణిలను కేజీహెచ్‌కు తీసుకెళ్లడం లేదని, దీనివల్ల ఆ గర్భిణులు అవస్థలు పడుతున్నారని కొందరు సభ్యులు సభలో చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

కేజీహెచ్ వైద్య సేవలపై విచారణ..

ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరులో ఈనెల 17న పురుగుల మందు తాగిన అనంత్ అనే యువకుడిని కేజీహెచ్‌కు తరలిస్తే వైద్యులు సరైన వైద్యం చేయలేదని, దీంతో ప్రైవేటు ఆస్పత్రిలో చేరిస్తే చనిపోయాడని అక్కడ జెడ్పీటీసీ కాకర దేవి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. సమావేశంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి, డీఎఫ్‌వో అనంత్ శంకర్ పాల్గొన్నారు.

కలెక్టర్ల పనితీరు భేష్!

- ప్రశంసించిన సభ్యులు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ముగ్గురు కలెక్టర్ల పనితీరు బాగుందని జెడ్పీటీసీలు, ఎంపీపీలు కొనియాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వీరు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లపై ప్రసంశల జల్లు కురిపించారు. తాము ప్రజా సమస్యలపై కలెక్టర్లకు ఫోన్ చేసినా, నేరుగా సంప్రదించినా సత్వరం స్పందిస్తున్నారని వారు పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడడంతో పాటు అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా కృషి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ ప్రజా రంజక పాలనకనుగుణంగా వీరు కూడా ఉత్తమ సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని వారు పేర్కొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఒక్కో రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రగతిని సాధిస్తున్నామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మంగళవారం జెడ్పీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల వరినాట్లు ఆలస్యమవుతున్నాయని, రైతులు నష్టపోకుండా రిజర్వాయర్ల దిగువ సాగు భూములకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ వైద్య సేవలు, టెలి మెడిసిన్, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సక్రమంగా అందుతున్నాయన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులను అందుబాటులో ఉంచామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర మాట్లాడుతూ చింతపల్లి, కొయ్యూరు, జీకే వీధి మండలాల వారి కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఎస్టీ సెల్ ఏర్పాటుకు తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. అనంతగిరి నుంచి కేజీహెచ్‌కు నేరుగా రోగులను తీసుకొచ్చేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఏయూతో కెనడా సంస్థ ఎంవోయూ

ఏయూ క్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో కెనడాకు చెందిన ఆరెంజ్ న్యూరో సైన్సెస్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, ఆరెంజ్ న్యూరోసైన్సెస్ సంస్థ సీఈవో డాక్టర్ వినయ్ సింఘ్‌లు సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, సైకాలజీ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. అవగాహన ఒప్పందంలో భాగంగా డిజిటల్ థెరపీ సెంటర్ ఏర్పాటు చేయడం, పరిశోధకులకు ఉచిత శిక్షణ అందించడం, రూ.10 లక్షలు విలువైన థెరపీ లైసెన్స్ ఏయూకు అందించనుంది. రెండు సంస్థలు కలసి పనిచేయాలని నిర్ణయించాయి.

నా గుండెల్లో కార్యకర్తలకు ప్రత్యేక స్థానం

- ఎవరి మాటలో నమ్మి నన్ను దూరం చేసుకోవద్దు
- అనకాపల్లి నుంచే పోటీ చేస్తా.. నా ఎలక్షన్ నిర్వహణ బాధ్యత మీదే!
- ఐదు నెలలు కష్టపడితే మళ్లీ ఐదేళ్లు అధికారం మనదే
- ప్రాణం పోయినా అవినీతికి పాల్పడను
- విజయ దశమి రోజు నుంచి అనకాపల్లిలోనే మకాం
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భావోద్వేగం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్. చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్

సాక్షి, అనకాపల్లి: 'నా మీద నమ్మకం ఉంటే నాతో ఉండండి..నన్ను నమ్మిన వారిని నేను ఎప్పుడూ దూరం చేసుకోను.. పలకరించలేదనో.. లేక పట్టించుకోలేదనో నన్ను దూరం చేసుకోవద్దు. నా గుండెల్లో నా తల్లిదండ్రులకు ఏ స్థానం ఉందో అంతకు మించి నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు ఉంది..' అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి భావోద్వేగ పూరితమైన ప్రసంగం చేశారు. ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్‌లతో కలిసి మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనకాపల్లి నుంచే తాను పోటీ చేస్తానని, కార్యకర్తలే తన బలమని, చెప్పుడు మాటలు విని తనను దూరం చేసుకోవద్దన్నారు. మీపై ఉన్న అభిమానాన్ని బహిర్గతం చేయలేకపోయినా, మీకు కష్టం వస్తే ఆదుకోవడానికి నేనున్నానని మంత్రి కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. తనను నమ్ముకున్న వారందరికీ ఏదో ఒక సమయంలో తగిన హోదా కల్పిస్తానని, ఇప్పటికే ఇది పలు సందర్భాల్లో రుజువైందన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పదవుల కేటాయింపులలో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోలేదని, ఆయా నాయకులు, కార్యకర్తలు సంప్రదింపులు జరుపుకొని తన దగ్గరికి వచ్చిన తర్వాతే ఆయా పదవులను భర్తీ చేశానని మంత్రి వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తాను అనకాపల్లి నుంచే పోటీ చేస్తానని, కార్యకర్తలే తన ఎలక్షన్ నిర్వహణ బాధ్యతను తీసుకోవాలని అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. రాజకీయాల్లో ఓపిక అవసరమని, సమయం వచ్చినప్పుడు పదవులు అందివస్తాయన్నారు. '2016లో నా వెంట 26 మంది మాత్రమే ఉన్నారు.. నా వెంట తిరగడానికి చాలామంది భయపడ్డారు. కానీ మొక్కవోని ధైర్యంతో రాజకీయ ప్రయాణం సాగించిన నాతో ఒక్కరొకరుగా కలిసి వచ్చారు..' అని పేర్కొన్నారు. పార్టీపై నాయకులలో నమ్మకం ఉంటే కార్యకర్తల్లో కూడా ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా తాను అవినీతికి పాల్పడుతున్నట్టు చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, ప్రాణం పోయినా అవినీతికి పాల్పడబోనని స్పష్టం చేశారు. తానేదో భూ కుంభకోణానికి పాల్పడ్డానని అంటూ దాన్ని నిరూపించడానికి వచ్చిన ఒక సినిమా యాక్టర్, కేవలం నాలుగు నిమిషాలు ఇక్కడ ఉండి నిరూపించలేకపోయారన్నారు. తన తాత, తండ్రి ఇచ్చిన రాజకీయ వారసత్వాన్ని తాను కొనసాగిస్తూ వస్తున్నానని, వారికి మచ్చ తెచ్చేలా ఎప్పటికీ వ్యవహరించనని అమర్‌నాథ్ చెప్పారు. దసరా నాటికి అనకాపల్లికి తాను మకాం మారుస్తానని మంత్రి తెలియజేశారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా వైఎస్సార్‌సీపీకి ఎనిమిది లక్షల మంది పైగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సైన్యం ఉందని, దేశంలోని మరే ఇతర పార్టీకి ఇంత బలం లేదని అమర్‌నాథ్ చెప్పారు. వచ్చే ఐదు నెలలు కష్టపడితే ఆ వచ్చే ఐదు ఏళ్లు మనదే అధికారం అని అమర్‌నాథ్ నాయకులను, కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ అనకాపల్లి నియోజకవర్గం ప్రశాంత వాతావరణంలో ఉందని, గత టీడీపీ పాలనలో వ్యాపారులతో పాటు అన్ని వర్గాల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని చెప్పారు. జిల్లాలో గవర సామాజిక వర్గానికే ఒక ఎంపీ, జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌లాంటి పదవులు కూడా ఇచ్చి గౌరవం కల్పించారన్నారు. ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకం సత్యనారాయణ, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీగున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ శ్రీను, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నాయకులు మలసాల కిశోర్, గోవింద తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్ నిర్లక్ష్యం.. హెల్పర్‌కి ప్రాణసంకటం

- కరెంట్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి
- జేఎల్‌ఎం నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- ఎల్‌టీ లైన్ ఆపి, హెచ్‌టీ లైన్ వదిలేయడమే కారణం


విద్యుత్‌షాక్‌కు గురైన వైర్ల మధ్య అపస్మారక స్థితిలో పడి ఉన్న రోజు కూలీ లక్ష్మణరావు


విద్యుత్ షాక్ గాయాలతో చోడవరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణరావు

చోడవరం: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం ఓ యువకుడికి ప్రాణాపాయాన్ని తెచ్చిపెట్టింది. జూనియర్ లైన్‌మన్ (జేఎల్‌ఎం) తన బాధ్యతల్ని రోజువారీ కూలీకి అప్పగించడమే దీనికి కారణం. చోడవరంలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలు. పట్టణ శివారు ద్వారకానగర్ ప్రాంతంలో విద్యుత్ లైన్‌లో సమస్య తలెత్తింది. సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాల్సిన స్థానిక జేఎల్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. తను చేయాల్సిన పనిని, రోజు కూలీగా వెంట తిప్పుతున్న దుర్గాకాలనీకి చెందిన సేవా లక్ష్మణరావు(30)కు అప్పగించారు. ఈయన విద్యుత్ సమస్య పరిష్కారానికి ఆంజనేయస్వామి గుడి వద్దనున్న విద్యుత్ స్తంభాన్ని ఎక్కాడు. ఈ స్తంభానికి పైన హెచ్‌టీ, కాస్త కింద ఎల్‌టీ లైన్లు ఉన్నాయి. ఎల్‌టీ లైన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపేశారు. హెచ్‌టీ లైన్ గురించి పట్టించుకోలేదు. రెండింటా సరఫరాను నిలిపేశారనుకున్న లక్ష్మణరావు హెచ్‌టీ వైర్లను తాకి షాక్‌కు గురై, ఎల్‌టీ లైన్ వైర్లపైనే కొనఊపిరితో వేలాడాడు. సమీపంలో ఉన్న వారు కేకలు వేయడంతో, విద్యుత్ సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరఫరాను వెంటనే నిలిపేశారు. అప్పటికే లక్ష్మణరావు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్తంభంపై వేలాడుతూ ఉన్న ఆతన్ని కిందికి దించి, చోడవరంలోని ఓ ప్రయివేట్ అస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. 70 శాతానికి పైగా కాలిన గాయాలతో ఉన్న అతని పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంపై చోడవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

విలపిస్తున్న తల్లి

ఆరోగ్య సమస్యలతో ఇంటికే పరిమితమైన తనకు అన్నీ తానై పోషిస్తున్న కొడుకు లక్ష్మణరావు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడని తెలియడంతో తల్లి లక్ష్మి గుండెలవిసేలా రోదిస్తోంది. లక్ష్మణరావుకు తండ్రి లేడు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిని కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు. విద్యుత్ షాక్ తగిలి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న కొడుకును తలచుకుని, ఇక తనకు దిక్కెవరంటూ విలపిస్తున్న ఆ తల్లిని చూసి, స్థానికులు కంట తడి పెట్టుకుంటున్నారు.

జేఎల్‌ఎం నిర్లక్ష్యమే కారణం?

ఈ ప్రమాదానికి పూర్తి బాధ్యత సదరు జేఎల్‌ఎందేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి స్తంభం ఎక్కి మరమ్మతులు చేపట్టాల్సిన జేఎల్‌ఎం దినసరి కూలీకి హెల్పర్‌ను తెచ్చుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ముందుగా ఆ లైన్‌లో విద్యుత్ సరఫరా గురించి పట్టించుకోకుండా, హెల్పర్‌ను స్తంభం ఎక్కించడం జేఎల్‌ఎం బాధ్యతా రాహిత్యమేనని ఆక్షేపిస్తున్నారు.

ఇది షరా మామూలే!

చోడవరం సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఏ ఒక్క విద్యుత్ సిబ్బంది లైన్లు ఎక్కి మరమ్మతులు చేయరని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజువారీ కూలీలతో పనులు కానిచ్చేస్తున్నారని చెప్తున్నారు. ఈ ఐదారేళ్లలో సుమారు 10 మంది ఇలానే మృత్యువాత పడినట్లు పేర్కొంటున్నారు.

ఈ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న జేఎల్‌ఎంలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించరనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు దీనిపై స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఈపీడీసీఎల్ చోడవరం ఏడీఈ గౌరీశంకర్‌ను సాక్షి వివరణ కోరగా బాధ్యులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ఈ సంఘటనపై క్షేత్రస్థాయి విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రమాదం కాదు.. హత్య

- ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య
- చంపేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం
- పోస్టుమార్టం నివేదికతో పన్నాగం బట్టబయలు


విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా


మృతుడు వరహాల బాబు (ఫైల్), అనాథలైన పిల్లలు

నర్సీపట్నం: ప్రియుడితో కలిసి భర్త అడ్డు తొలగించేందుకు స్కెచ్ వేసింది.. పథకం ప్రకారం హతమార్చి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించింది. పోలీసులు కూడా ఆమె చెప్పిందే నమ్మారు. చివరకు పోస్టుమార్టం నివేదిక ఈ హైడ్రామాను బట్టబయలు చేసింది. నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వివరించారు. గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామానికి చెందిన గొల్లు జానకికి.. అదే గ్రామానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు అలియాస్ వరహాలబాబు(33)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇదే మండలంలోని కేడీ పేట గ్రామానికి చెందిన చింతల రాము (34)తో జానకికి కొంతకాలంగా వివాహేతర సంబంధం నడుస్తోంది. భర్త అడ్డంకిగా మారడంతో ప్రియుడితో కలిసి హతమార్చేందుకు ప్లాన్ చేసింది. కోటవురట్ల మండలం పాములవాక పట్టాలమ్మ గుడికి తీసుకువెళ్లాలని భర్త వరహాలబాబును కోరింది. వరహాలబాబు ఈ నెల 20వ తేదీన భార్యను అమ్మవారి గుడికి తీసుకువెళ్లాడు. వారిని ప్రియుడు చింతల రాము వెంబడిస్తూ వెళ్లాడు. అమ్మవారి దర్శనం అనంతరం భార్యాభర్తలు బైక్‌పై బయలుదేరారు. తాండవ జలాశయం రోడ్డుపై వస్తుండగా కాలకృత్యాలు తీర్చుకునేందుకు బైక్ ఆపమంది. జీడిమామిడి తోటలోకి భర్తను తీసుకువెళ్లింది. కొంతసేపు కూర్చుందామని తోటలోకి తీసుకువెళ్లి భర్తను తన ఒడిలో పడుకోబెట్టుకుంది. పొదల్లో నుంచి ప్రియుడు రాము వచ్చి తన వెంట తీసుకువచ్చిన సుత్తితో వరహాలబాబు తలపై బలంగా గాయపరిచాడు. కొనఊపిరితో ఉన్న వరహాలబాబును ఇద్దరూ రాళ్లతో కొట్టి చంపేశారు. శవాన్ని రోడ్డుపైకి తీసుకువచ్చి బైక్ పక్కన పెట్టి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించారు. పోస్టుమార్టం నివేదికలో హత్యగా నిర్ధారణ కావడంతో భార్యపై అనుమానం వచ్చిందని, సీఐ రమణయ్య, ఎస్సై నారాయణరావు లోతుగా విచారించడంతో నిందితురాలు నేరం అంగీకరించిందని ఏఎస్పీ చెప్పారు. హత్యకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అనాథలైన పిల్లలు

తండ్రి వరహాలబాబు చనిపోవడం, తల్లి జైలుపాలు కావడంతో పిల్లలు వాసుదేవనాయుడు, పావని అనాథలయ్యారు. తండ్రి ఆదివారం చనిపోగా సోమవారం రాత్రి పోస్టుమార్టం అనంతరం కొత్తమల్లంపేటలో అంత్యక్రియలు జరిపారు. తల్లిని మంగళవారం అరెస్టు చేయడంతో ఇద్దరు పిల్లలూ బిక్కుబిక్కుమంటూ కనిపించారు. తండ్రి కుటుంబ సభ్యులు వారిని స్వగ్రామమైన కొత్తమల్లంపేట తీసుకువెళ్లారు.

వివాదం ఈనాటిది కాదు


నిందితుడు రాము

గొలుగొండ: జానకికి చింతల రాముతో ఏడాదిన్నర కాలంగా వివాహేతర సంబంధం ఉన్నట్టు తెలుస్తోంది. ఏడాది కిందట వారిద్దరూ బయటకు వెళ్లిపోవడంతో వరహాలబాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇద్దరినీ వారు తీసుకువచ్చారు. తప్పు చేశానని, తన భర్తతో ఉంటానని జానకి చెప్పడంతో వరహాలబాబు భార్యను ఇంటికి తీసుకువెళ్లాడు. అయినా వివాహేతర సంబంధం కొనసాగుతూనే ఉంది. భర్త అడ్డు తొలగించుకోవడం కోసం జానకి చాలా సార్లు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. నెల రోజులుగా ప్రతి ఆదివారం భర్తను గుడి కి తీసుకువెళ్లమని అడిగేదని కుటుంబ సభ్యులు చెప్పారు.

క్లుప్తంగా

చంద్రయాన్‌-3 సేఫ్‌గా ల్యాండ్‌ అవ్వాలని..



విద్యార్థినులు, ఉపాధ్యాయినుల విజయ సంకేతం

కోటవురట్ల: చంద్రయాన్‌-3 విజయవంతం కావాలని స్థానిక కేజీబీవీ విద్యార్థినులు అభిలషించారు. ఈ మేరకు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. చంద్రునిపై చంద్రయాన్‌-3 విజయవంతంగా ల్యాండ్‌ అవ్వాలని కోరుతూ నినాదాలు చేశారు. ప్రపంచ దేశాలకు భారతదేశం మార్గదర్శకం కావాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో సరోజినిదేవి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీ నియమించాలి



ఉపాధ్యాయులతో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్‌

నర్సీపట్నం: పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్‌ కోరారు. మంగళవారం నర్సీపట్నం మండలంలో పలు పాఠశాలలను సందర్శించామన్నారు. అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రతి హైస్కూల్‌కు కంప్యూటర్‌ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. మెర్జింగ్‌ పాఠశాలలో 3, 4, 5 తరగతులకు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఈ సమస్యలను రాష్ట్ర యూనియన్‌ నాయకత్వం ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్‌

రావికమతం: మండలంలోని గడబపాలెం గ్రామానికి చెందిన నందిల మల్లేష్‌ను సారాతో సహా పట్టుకుని అరెస్ట్‌ చేసినట్టు ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో సహా దాడి చేశామన్నారు. నిందితుడి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.



పట్టుకున్న సారాతో ఎస్‌ఐ

బొడ్డేరు.. నిండుగా సాగునీరు!

- నిత్యం కుడి, ఎడమ కాలువల్లో నీటి ప్రవాహం
- తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ రెండు పంటలు
- జిల్లాలోనే ముందుగా వరినాట్లు
- విప్పలపాలెం ఆయకట్టుకు వరం

కాలం ఏదైనా విప్పలపాలెం ఆయకట్టు సస్యశ్యామలంగా దర్శనమిస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లోనూ ఖరీఫ్‌, రబీ పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. జిల్లాలో అన్ని ప్రాంతాల కంటే ముందుగానే వరినాట్లు పూర్తయి పచ్చని పైరుతో కళకళలాడుతోంది. నిత్యం జీవనదిలా ప్రవహించే బొడ్డేరు గెడ్డ పుణ్యమా అని ఇది సాధ్యమవుతోంది.

గొలుగొండ: మండలంలోని చోద్యం సమీపంలో విప్పలపాలెం, గాదంపాలెం, అమ్మపేట, కొత్తమల్లంపేట తదితర ప్రాంతాల రైతులకు బొడ్డేరు ఆయకట్టు వరం. ఈ ఆయకట్టు దిగువున రెండు వేల ఎకరాల్లో ఖరీఫ్‌ వరినాట్లు వేశారు. ఇక్కడ సాగునీటికి ఢోకా లేకపోవడంతో రబీ వరి పంట సైతం పండిస్తుంటారు.

నిత్యం జీవనదిలా...

చోద్యం వద్ద బొడ్డేరు గెడ్డ నిత్యం జీవనదిలా ప్రవహిస్తోంది. ఈ గెడ్డ అల్లూరి జిల్లా శరభన్నపాలెం, నడింపాలెం, ప్రాంతాల్లోని కొండల నుంచి మొదలై గొలుగొండ మండలం దారకొండ తదితర ప్రాంతాల మీదుగా ప్రవహిస్తోంది. విప్పలపాలెం ఆయకట్టు వద్ద మిగులు నీరు తాండవ జలాశయంలోకి చేరుతోంది.

కాలం ఏదైనా నాట్లు ముందుగానే...

విప్పలపాలెం ఆయకట్టు దిగువన సాధారణ విస్తీర్ణం రెండు వేల ఎకరాలు. ఇక్కడ పూర్తి స్థాయిలో ఏటా నాట్లు జూలైలోనే పూర్తి చేస్తారు. ఈ ఏడాది రైతులకు సకాలంలో వర్షాలు లేక నాట్లు వేసిన ప్రాంతాల్లో ఎండిపోతున్న తరుణంలో ఇక్కడ సాగునీరు పుష్కలంగా ప్రవహించడం విశేషం. రోజూ కుడి, ఎడమ కాలువల ద్వారా అన్ని ప్రాంతాలకు సాగునీరు అందుతోంది. మండు వేసవిలోనూ నీరుకు ఢోకా ఉండదు. మండలంలో నాలుగు వేల ఎకరాల్లో నాట్లకు అవసరమైన సాగునీరు అందుతుంది.



బొడ్డేరు నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు(ఫైల్‌)



పొర్లు కట్టు నుంచి ప్రవహిస్తున్న సాగునీరు



ఆయకట్టు దిగువున నాట్లు వేసిన రైతులు

తాండవకు చేరని చుక్క నీరు

ఉత్తరాంధ్రలో అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టులో ఒకటైన తాండవ జలాశయానికి గొలుగొండ మండలంలో ప్రవహించే గెడ్డలే ఆధారం. బొడ్డేరు, దార గెడ్డ, బోరింగ్‌ గెడ్డ, గొర్రి గెడ్డల నుంచి పారే నీరు తాండవలో కలుస్తోంది. గతంలో ఖరీఫ్‌ సీజన్‌లో ఇక్కడ రైతులకు సాగునీరు అవసరం ఉండేది కాదు. నిత్యం ప్రవహించే గెడ్డల నుంచి నీరు తాండవ జలాశయానికి చేరేది. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం ఇక్కడ పంటలకు సాగునీరు అందుతుందే తప్ప తాండవకు చుక్క నీరు చేరలేదు. వర్షాలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఏటా పంటలు

విప్పలపాలెం ఆయకట్టులో ఏటా ఖరీఫ్‌, రబీ పంటలు పండిస్తాం. నిత్యం ప్రవహించే సాగునీరు వల్ల రైతులు ఇబ్బందులు లేవు. ఎంత ఎండలు కాసినా బొడ్డేరు గెడ్డ నుంచి సాగునీరు ప్రవహిస్తోంది.



– నాయుడు, రైతు విప్పలపాలెం

కాలువలు బాగున్నాయి

విప్పలపాలెం ఆయకట్టు ప్రాంతంలో కుడి, ఎడమ కాలువలు బాగున్నాయి. అందుకే చివరి ఆయకట్టు వరకు సాగునీరు సక్రమంగా పారుతోంది. ఈ ప్రాంతంలో రైతులకు రెండు పంటలకు ఎన్నడూ సాగునీరు ఢోకా ఉండదు.



– సూర్య, నీటిపారుదల శాఖ ఏఈ, గొలుగొండ

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు: జేసీ

మాకవరపాలెం: విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జాయింట్‌ కలెక్టర్‌ జాహ్నవి స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా రూ. 4 లక్షలతో చేపట్టిన కార్యాలయ భవన మరమ్మతులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌ ప్రసాద్‌, సర్వే సిబ్బందితో సమీక్షించారు. గ్రామాల్లో భూముల రీ సర్వే, ఓటరు సర్వేపై ఆరా తీశారు. స్పందనలో వస్తున్న అర్జీలు, వాటి పరిష్కార వివరాలను తెలుసుకున్నారు. రెవెన్యూ సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరులో మార్పు రాకుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో డీటీ శంకర్‌, సర్వేయర్‌ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



కార్యాలయానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

వాహనం ఢీ కొట్టి వ్యక్తి మృతి

పాయకరావుపేట : స్థానిక తాండవ జంక్షన్‌ వద్ద జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. తునికి చెందిన ముత్తా శంకర్రావు (41) సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీ కొట్టడంతో శంకర్రావు నడముభాగం నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి మృతి చెందిన శంకర్రావు

విజయ దుందుభి మోగిస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దంతులూరి దిలీప్‌కుమార్‌, పక్కన బొడ్డేడ ప్రసాద్‌ తదితరులు

- రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యం
- అప్పగించిన పదవికి న్యాయం చేస్తా:దంతులూరి

అనకాపల్లి టౌన్‌: రానున్న సార్వత్రిక ఎన్నికలల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, విజయ దుందుభి మోగిస్తామని ఏపీ ఇన్‌లాండ్‌ వాటర్‌వేస్‌ అథారిటీ చైర్మన్‌ దంతులూరి దిలీప్‌కుమార్‌ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. 1987 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నానని, మాజీ సీఎంలు మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వై.ఎస్‌.రాజశేఖర్‌రెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నాయకత్వంలో అనకాపల్లి నుంచి కాంగ్రెస్‌ తరఫున మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశానన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా నియోజకవర్గ ప్రజలు ఆదరించడం తన అదృష్టమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీలో 2017వ సంవత్సరంలో చేరి అప్పటి నుంచి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పనిచేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను వైఎస్సార్‌సీపీ కై వసం చేసేలా కృషి చేస్తామని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి వ్యక్తికి గుర్తింపు లభిస్తుందన్నారు. జిల్లా మంత్రుల సహకారంతో వివిధ విభాగాల పోస్టులను త్వరలో నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్‌, ఎన్టీఆర్‌ ఆస్పత్రి డైరెక్టర్లు జి.రామ్మూర్తి, మునూరు శ్రీనివాసరావు, ఎ.వి.రత్నకుమారి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణఅప్పారావు, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి, కశింకోట మండల అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ డిప్యూటీ సీఎంకు వినతి

మహారాణిపేట(విశాఖ): దిశ వన్‌ స్టాప్‌ సెంటర్‌ (సఖి) ఉద్యోగులకు బకాయి ఉన్న పది నెలల జీతాలు వెంటనే చెల్లించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ తరఫున వినతిపత్రం సమర్పించారు. మంగళవారం జిల్లా పరిషత్‌ సర్వసభ్య సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎంకు సీఐటీయూ నాయకురాలు మణి, వన్‌స్టాప్‌ సెంటర్‌ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. 11 సంవత్సరాల క్రితం వన్‌ స్టాప్‌ సెంటర్‌ (సఖి)లో కాంట్రాక్ట్‌ పద్ధతిలో నియమితులయ్యారని, నాటి జీతాలే నేటికీ ఇస్తున్నారని యూనియన్‌ నాయకురాలు మణి వివరించారు. ఇది కూడా ఎప్పుడు బడ్జెట్‌ వస్తే అప్పుడు ఇస్తున్నారని తెలిపారు. రెండేళ్లుగా సక్రమంగా బడ్జెట్‌ విడుదల చేయలేదని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, దిశ ఉద్యోగులు కె.కుసుమ, జేఎస్‌కేఆర్‌ అరుణ, ఎస్‌.దేవి, జి. రాజేష్‌, డి.అప్పలరాజు, జి.కొండలరావు, ఎం.వెంకటరావు, టి. అరుణకుమారి పాల్గొన్నారు.



వినతిపత్రం పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

యువతిపై అత్యాచారం ఆరోపణల్లో నిజం లేదు

- ఈవ్‌ టీజింగ్‌ కేసులో యువకుడిని రిమాండ్‌కు తరలించాం
- అనకాపల్లి డీఎస్పీ సత్యనారాయణ వెల్లడి

పరవాడ: పరవాడకు చెందిన ఓ యువతిని ఈ నెల 13వ తేదీ రాత్రి ఈవ్‌టీజింగ్‌ చేసిన యువకుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అనకాపల్లి డీఎస్పీ ఎస్‌.వి.సత్యనారాయణ తెలిపారు. పరవాడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొంతమంది ఆ యువతిపై అత్యాచారం జరిగిందని, దిశ చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేయలేదని ట్విట్టర్‌, ఫేస్‌బుక్‌లో అసత్య పోస్టులు పెడుతున్నారని.. ఇది కేవలం ఈవ్‌ టీజింగ్‌ కేసు మాత్రమేనని వెల్లడించారు. ఆ యువతి ఈ నెల 13న రాత్రి వాకింగ్‌కు వెళ్లి వస్తుండగా ఆమె చెవి రింగ్‌లు పడిపోయాయి. వాటిని వెతుకుతుండగా.. రామాలయం వీధికి చెందిన అక్కినేని సంతోష్‌ కుమార్‌ వాహనంపై వచ్చి ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు అందిందని తెలిపారు. విచారణ చేపట్టి సోమవారం యువకుడిని అరెస్ట్‌ చేసి, మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో పరవాడ సీఐ పి.ఈశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనకాపల్లి డీఎస్పీ సత్యనారాయణ

21 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురు నిందితుల అరెస్టు

చీడికాడ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పి.రామారావు మంగళవారం తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం మండలంలోని అప్పలరాజుపురం వద్ద వాహనాలు తనిఖీ చేశామన్నారు. ఆ సమయంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన శ్రీనివాసులు, ముత్యాలు, అల్లూరి జిల్లా పాడేరుకు చెందిన ధర్మరాజు తమ లగేజీ బ్యాగులతో పరారవుతుండగా పట్టుకున్నామన్నారు. వారి బ్యాగులు పరిశీలించగా ఒక్కొక్క బ్యాగులో ఏడు కిలోల చొప్పున గంజాయి పట్టుబడిందన్నారు. రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరు గంజాయిని ఒడిశా నుంచి అనంతపురం జిల్లా ధర్మవరం తరలిస్తున్నట్లు విచారణ తేలిందన్నారు.



పట్టుబడిన గంజాయిని చూపుతున్న దృశ్యం

లేగదూడల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



పాకలపాడు గ్రామంలో లేగదూడల ప్రదర్శన జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: లేగదూడల పెంపకంలో పశువైద్య సిబ్బంది సూచనలు సలహాలు తప్పకుండా పాటించాలని అనకాపల్లి జిల్లా పశువైద్యశాఖ ఈవో రామ్‌మోహన్‌, నర్సీపట్నం ఏడీ రాంబాబు తెలిపారు. పాకలపాడులో మంగళవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పాకలపాడు, పుత్తడిగైరంపేట, కోదులపాలెం, రావణాపల్లి, కొమిర తదితర ప్రాంతాల నుంచి 90 లేగదూడలను ప్రదర్శనకు తీసుకురావడం జరిగింది. ఈ లేగదూడల ప్రదర్శనలో ప్రథమ స్థానం మేడిశెట్టి బెన్నియ్యనాయుడు, రెండో స్థానంలో మేడిశెట్టి గంగాధర్‌కు చెందిన లేగదూడలు నిలిచాయి. పశుసంవర్ధశాఖ ఈవో మాట్లాడుతూ రైతులు లేగదూడల పెంపకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు పాల సేకరణ కంటే లేగదూడల పెంపకం వల్ల మంచి ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం రైతులకు రాయితీలు అందిస్తోందని, ఇవన్నీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రాంతంలో ఒంగోలు, ముర్రా, జెర్సీ హెచ్‌ఎఫ్‌ వంటి రకానికి చెందిన లేగదూడలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు రమేష్‌తో పాటు సర్పంచ్‌ రాజాన పద్మ పాల్గొన్నారు.

భర్త చెంతకు మతిస్థిమితం లేని భార్య

అనకాపల్లి టౌన్‌: మతిస్థిమితం కోల్పోయిన భార్యను భర్తకు అప్పగించినట్టు సీఐ దాడి మోహన్‌రావు మంగళవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు ... ఈ నెల 20న స్థానిక శారదా నది వద్ద శృతి అనే వివాహిత మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నట్టు గుర్తించి పోలీస్‌ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమె స్వస్థలం మహారాష్ట్ర, తన భర్త కిరణ్‌ అని విచారణలో తెలిపింది. ఈ మేరకు కిరణ్‌కు ఫోన్‌ చేయగా, మహారాష్ట్ర నుంచి అనకాపల్లి రావడంతో ఆమెను అప్పగించారు.

దొంగనోట్ల కేసులో మరొకరు అరెస్ట్‌

అనకాపల్లిటౌన్‌: దొంగ నోట్లు సరఫరా చేసిన కేరళ రాష్ట్రం వెలుపడం గ్రామానికి చెందిన రంజిత్‌ను పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న చీడికాడ బైలపూడి గ్రామానికి చెందిన గుమ్మడి నిరంజన్‌, జెట్టి రాము పూడిమడక రహదారి యాక్సిస్‌ బ్యాంకులో రూ.50 వేలు నగదు డిపాజిట్‌ చేశాడు. అందులో రూ.24 వేలు దొంగనోట్లుగా గుర్తించిన బ్యాంకు అధికారులు పట్టణ పోలీసులకు అదే నెల 18న ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం రాము, నిరంజన్‌లు ఇచ్చిన సమాచారం మేరకు దొంగనోట్లు సరఫరా చేసిన కేరళ రాష్ట్రానికి చెందిన బిచ్చు అనే వ్యక్తి మార్చి 1న అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. యాక్సిస్‌ బ్యాంకులో నగదు డిపాజిట్‌ చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ మేరకు తమకు చిక్కిన నాలుగో వ్యక్తి రంజిత్‌ను మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు.

25న ఉపాధి కార్యాలయంలో మెగా జాబ్‌మేళా

కంచరపాలెం (విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్‌ కెరీర్‌ సర్వీస్‌ సెంటర్‌లో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్‌ అధికారులు సీహెచ్‌ సుబ్బిరెడ్డి (క్లరికల్‌), కె.శాంతి (టెక్నికల్‌) తెలిపారు. రక్షిత డ్రగ్స్‌, ఏడీఎల్‌ ఆగ్రో ఫార్మా, ఆటోమోటివ్‌ మ్యానుఫ్యాక్చర్స్‌, రక్షిత్‌ ఫార్మాసూటికల్‌, టీం లీజ్‌ యూనియన్‌ బ్యాంక్‌, శ్రీరామ్‌ లైఫ్‌ ఇన్సూరెన్స్‌ ప్రైవేటు లిమిటెడ్‌ కంపెనీలో 282 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ప్రొడక్షన్‌ ఆపరేటర్‌, కెమిస్ట్‌, ప్రాసెస్‌ డెవలప్‌మెంట్‌ ల్యాబ్‌ కెమిస్ట్‌, ఫిట్టర్స్‌, కస్టమర్‌, అండ్‌ ఫీల్డ్‌ ట్రైనీ, సేల్స్‌ డెవలప్‌మెంట్‌ మేనేజర్‌, ఫార్మాసిస్ట్‌, అకౌంటెంట్‌, సేల్స్‌ ఎగ్జిక్యూటివ్‌, ఫైనాన్స్‌ ఎగ్జిక్యూటివ్‌, హార్టీకల్చర్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌, మెకానిక్స్‌, టెలికాలర్స్‌, టీం లీడర్స్‌, అసిస్టెంట్‌ సేల్స్‌ మేనేజర్‌, కంప్యూటర్‌ ఆపరేటర్‌ ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల కల్గిన అభ్యర్థులు అర్హులన్నారు. జీతం నెలకు రూ.12 వేలనుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. ncs.gov.inలో అభ్యర్థుల పేర్లు రిజిస్టర్‌ చేసుకోవాలని కోరారు.

ఒడిశా కార్మికుల మృతిపై విచారణ



కార్మికులు నివాసముంటున్న షెడ్‌ల వద్ద డీఎల్‌పీవో మూర్తి, తదితరులు



సహచర కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

- రంగంలోకి ఎక్సైజ్‌ శాఖ, డీఎల్‌పీవో

అచ్యుతాపురం(అనకాపల్లి): సంచలనంగా మారిన ఒడిశా కార్మికుల మృతి అంశంపై వివిధ శాఖల అధికారులు రంగంలోకి దిగి వాస్తవాలను నిర్ధారించేందుకు విచారణ ప్రారంభించారు. ఈ నెల 15న ఒడిశా నుంచి బతుకుదెరువు కోసం విచ్చేసిన ఆరుగురు కార్మికుల్లో ముగ్గురు 16వ తర్వాత మృతి చెందిన విషయం విదితమే. వీరి మరణాలకు ఫుడ్‌ పాయిజన్‌ గానీ, కల్తీ మద్యం గానీ కారణం అని భావించడంతో వైద్య శాఖ, పంచాయతీ రాజ్‌ శాఖ, ఎక్సైజ్‌ శాఖ, పోలీసులు అచ్యుతాపురం సెజ్‌లోని దుప్పితూరులో కూలీలు ఉంటున్న షెడ్‌లను పరిశీలించారు. అనుమానాస్పద రీతిలో చనిపోయిన ముగ్గురు కార్మికుల విషయమై వాస్తవాలు అందించాలని ఒడిశా వైద్య శాఖ ఏపీ వైద్య శాఖను కోరింది. దీంతో డీఎంహెచ్‌వో హేమంత్‌ ఆదేశాలతో అచ్యుతాపురం సీహెచ్‌వో వేణుగోపాల్‌రావు ఆది, సోమవారాలు కూలీలు ఉంటున్న ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ ఒడిశా కార్మికులతో మాట్లాడారు. ఈ నెల 15న రాత్రి పార్టీ చేసుకున్న ముగ్గురు కార్మికులు మద్యం సేవించిన తర్వాత తిన్న ఆహారం వారి అనారోగ్యానికి కారణమైందని ప్రాథమికంగా తేల్చారు. ఇదే నివేదికను స్థానిక వైద్యాధికారి అలేఖ్య డీఎంహెచ్‌వోకు పంపించారు. కల్తీ మద్యం అనే అంశం వాస్తవాలు తేల్చేందుకు గానూ యలమంచిలి ఎక్సైజ్‌ పోలీసులు మంగళవారం కార్మికులు ఉండే షెడ్‌లను పరిశీలించారు. అదే విధంగా నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి షెడ్‌లను పరిశీలించి వివరాలు సేకరించారు.

వలస కార్మిక చట్టం అమలు చేయాలి: సీఐటీయూ

అచ్యుతాపురం సెజ్‌లో పనిచేస్తున్న పొరుగు రాష్ట్రాల కార్మికుల కోసం వలస చట్టం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు ఆర్‌.రాము, సోమునాయుడు డిమాండ్‌ చేశారు. మంగళవారం వీరు కార్మికుల షెడ్‌లను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. కార్మికుల శ్రమను కంపెనీలు దోచుకుంటున్నాయని, వలస కార్మికులు ఎంత మంది ఉన్నారు..? ఎక్కడ ఉంటున్నారు..? వారి ఇచ్చే వేతనం ఎంత..? అనే వివరాలు ఏపీఐఐసీ వద్ద గానీ కార్మిక శాఖ వద్ద గానీ ఎందుకు లేవని ప్రశ్నించారు. ఒడిశా కార్మికుల మృతిపై దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని, ఆయా కుటుంబీకులకు పరిహారం అందించాలని డిమాండ్‌ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్‌

Education

HOME TUITIONS

■ S.S.Home Tuitions LKG-PG, SSC / CBSE / ICSE, INTER (IIT/ NEET / EAMCET, +1, +2), Dip & B.Tech (All Bran) Want M/F. Ph : 77998 85853, 83093 58985 [V- 4799]

OPEN SCHOOL

■ ఎటువంటి విద్యార్హత ఉన్నా లేకపోయినా డైరెక్ట్‌ 10th మరియు టిసిపై సం॥ అంతకన్నా పైబడినవారు ఇంటర్‌ ఓపెన్‌స్కూల్‌ ద్వారా ఒకే సం॥లో పూర్తి చేసుకోవచ్చు. ఫోన్‌: 73862 63237, 90590 86040 [V- 2106]

ONE SITTING

■ One Sitting : 10th, Inter, Degree (All), PG (All), BBA, BCA, MBA, MCA, Dip. Engg., B.Tech, M.Tech, Dip. VET, Nursing, Pharmachy, B.Ed, Ph.D from Govt. Recog. Univs. Ph : 83417 74299 [V- 794480]

■ ONE SITTING 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA, BCA, MBA, Nursing Pharmacy, Dip. In VET. B.Tech., from Recog., Universities in India. (for Discont.) Exam in August. ✆ : 73383 76874 [R-63]

Real Estate

FLAT FOR SALE

■ మర్రిపాలెం జ్యోతినగరలో 2 BHK ఫ్లాట్‌ @ 63 లక్షలకే అమ్మకం. 1150 + 80 Sft. N/F కార్‌ పార్కింగ్‌, లిఫ్ట్‌ సదుపాయంతో. ఫోన్‌ : 98663 21992 [V- 652]

PLOT FOR SALE

■ GVMC పరిధి 4 లక్షలకే 100 గజాలు. 150, 200 గజాలు – 50 బిట్లు కలవు. స్టీల్‌ప్లాంట్‌కి 7 కి.మీ.దూరంలో, EMI సదుపాయం కలదు. ఫోన్‌ :73864 14017, 70936 32399 [V- 794481]

Services

GOLD LOANS

■ లోకేష్‌ గోల్డ్‌ లోన్స్‌ :- బ్యాంక్‌/ప్రైవేట్‌ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్‌ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10987]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్‌ ధర ప్రకారం కొనబడును. (స్పాట్‌ క్యాష్‌) 100% జెన్యూన్‌. ✆ 76508 91999 [B-788207]

Wanted

■ ప్రముఖుల ఇళ్ళ వద్దనే వుండి వృద్ధులను, బెడ్‌ పేషెంట్స్‌ను చూసుకొనుటకు M/F కేర్‌ టేకర్స్‌, ఆయాలు, నర్సులు కావలెను. జీతం 14-20K, వసతి +భోజనం VJA ✆ 91608 35559,78158 35561 [B-330]

■ ప్రముఖ హెల్త్‌ కంపెనీలో జిల్లా వ్యాప్తంగా పనిచేయుటకు టీం లీడర్స్‌ కావలెను. నో సేల్స్‌, నో టార్గెట్స్‌, ప్రతి నెల 15 వేలు నుంచి 30 వేలు వరకు సంపాదించవచ్చు. పూర్తి వివరాలకు కాల్‌ : 89782 49141 [V-11010]

■ హ్యాండ్‌ బ్యాగ్స్‌, షాపింగ్‌ బ్యాగ్స్‌ కటింగ్‌ మరియు "స్టిచ్చింగ్‌"కి పనిచేయుటకు వర్కర్స్‌ కావలెను. రీడింగ్‌ రూమ్‌ కురుపాం మార్కెట్‌ , వారి వీధి. ఫోన్‌: 93912 92875, 81060 26987 [V-794599]

డాక్యుమెంట్‌ పోయినది

చదరం లక్ష్మీ గణేష్‌ D.No.15-7, చిన్నయ్యపేట, తుమ్మపాల, అనకాపల్లి అను నేను తేది 04/08/2023న అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్‌ వద్ద ఆటో నుండి దిగుతుండగా అనకాపల్లి SRO నందు రిజిస్టర్‌ కాబడిన [illegible] మండలంలో నేను కొన్న స్థలం యొక్క ఒరిజినల్‌ సేల్‌ డీడ్‌ దస్తావేజు నంబర్‌ 4664/2022 పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలుపగలరు. చదరం లక్ష్మీ గణేష్‌ W/o చదరం నాగ మహాలక్ష్మి నాయుడు D.No 15–7 చిన్నయ్యపేట, తుమ్మపాల, అనకాపల్లి పిన్‌ 531032 Mob No:72073 42201

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్‌ చేస్తూ ప్రముఖ గ్లోబల్‌ కంపెనీలో నెలకు మంచి ఆదాయం సంపాదించవచ్చు. పార్ట్‌ / ఫుల్‌ టైం. 100% ఎటువంటి ఫీజులు ఉండవు. ఫోన్‌: 97015 05819 [V-797285]

■ అనుభవం కలిగిన అకౌంటెంట్‌, మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్‌ కావలెను. అర్హత : ఇంటర్‌, డిగ్రీ, మంచి జీతం. శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్‌, ప్రియా గార్డెన్స్‌, సింహాచలం. ఫోన్‌: 94418 74245 [V- 1199]

■ మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్‌ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్‌ వాట్సప్‌ చేయండి. వివరాలకు కాల్‌ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221522]

■ చిలకలూరిపేటలోని మా ఫ్యామిలీ రెస్టారెంట్‌ నందు కుండ బిర్యాని, బొంగు చికెన్‌, మొ॥నవి చేయుటకు వంట మాస్టారులు కావలెను. భోజనం+వసతి+ ఆకర్షణీయమైన జీతం. 8309295896, 8142038308(w) [G-887]

■ MS కంపెనీ నందు ఇంటి నుంచి పార్ట్‌టైమ్‌ /ఫుల్‌ టైమ్‌ వర్క్‌ చేయుటకు టెలికాలర్స్‌ కావలెను. మేల్‌/ఫిమేల్‌, Qly:10th, జీతం: 16,000 -18,000 Ph: 9989923178/ 7075227337 [HA-498]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్‌, నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K ఏజెంట్‌ కమీషన్‌ 3K. ఫోన్‌: 9848571888. [HA-529]

సాక్షి క్లాసిఫైడ్స్‌ లలితానగర్‌, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా నాలుగు లైన్లు రూ.475/- అదనపు లైను రూ.100/- + 5% జి.ఎస్‌.టి. అదనం

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: నియోజకవర్గ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో పి.ప్రభావతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 29 సాయంత్రం 5 గంటల్లోపు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తుల్ని అందించాలన్నారు. ఈ ఏడాది జూలై 1 నాటికి 21 నుంచి 35 ఏళ్లలోపు వయసుకలిగి, పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక వివాహితలు అర్హులన్నారు. రిజర్వేషన్ కేటగిరీ మేరకు పోస్టుల్ని భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని 82వ వార్డు పరిధి పూడిమడక రోడ్-2 ఆయా పోస్టు ఎస్టీకు, మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట ఆయా పోస్టు బీసీ-బీ, కశింకోట మండలం జెట్టపురెడ్డితుని ఖాళీని ఓసీ అభ్యర్థులతో భర్తీ చేస్తామన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన



ఎంఈవో కార్యాలయం వద్ద ప్లకార్డులతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

అనకాపల్లిటౌన్: సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం ప్రతినిధులు రఫీ, నాగరాజు, మోహన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్లకార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 జూన్ నాటికి సమగ్రశిక్ష సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ఎంటీఎస్ అమలు, వేతనాలు పెంపు, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం తదితర నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలకు ఫ్యాన్ల వితరణ

నక్కపల్లి : స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు నక్కపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మేడేటి శంకర్ సుమారు రూ.10 వేలు విలువ గల నాలుగు సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా అందజేశారు. మంగళవారం వాటిని పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. తరగతి గదుల్లో ఏర్పాటు చేసేందుకు ఈ ఫ్యాన్లు ఇచ్చినట్లు శంకర్ తెలిపారు. శంకర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 113 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,150	4,400
రెండో రకం	4,090	4,100
మూడోరకం	3,500	4,080

అనకాపల్లి సినిమాలు

బేబి	రాజా
పిజ్జా	సత్యనారాయణ స్క్రీన్-1
డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	షిర్డిసాయి
భోళాశంకర్	పర్తిసాయి
భోళాశంకర్	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	శ్రీసత్య
బ్రో	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-17 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 415 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ఈ-క్రాప్.. రైతులు సేఫ్

- మండలంలో మొదలైన ఈ-క్రాప్
- సెప్టెంబర్ 15 వరకు నమోదు గడువు
- 11,283 మంది రైతులకు భరోసా

వ్యవసాయం.. గత ప్రభుత్వ హయాంలో దండగ. రైతు బాంధవుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాకతో సాగు తీరే మారింది. ఆరుగాలం శ్రమించి, ప్రజలకు తిండి గింజలు అందించే అన్నదాతను ఆదుకునేందుకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. పంట నష్టానికి సత్వర పరిహారం అందించేందుకు ఈ-క్రాప్ నమోదును తీసుకొచ్చారు. దీంతో పక్కాగా సాగు లెక్క తేలి, రైతుల్ని తక్షణమే ఆదుకునేందుకు వీలవుతోంది.

తుమ్మపాల: మండలంలో వరినాట్లు ఊపందుకున్నాయి. దీంతోపాటే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ కూడా జోరందుకుంది. రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా రైతుకు అవసరమైన సేవలన్నీ ప్రభుత్వం అందిస్తోంది. సాగులో పెట్టుబడి సాయం నుంచి, ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ చేస్తోంది. ఇపుడు సాగు చేస్తున్న పంట ఏ కారణం చేతనైనా నష్టపోతే, వారిని ఆదుకునేందుకు ఈ-క్రాప్‌లో పంట వివరాల నమోదు ప్రక్రియను వేగవంతం చేసింది.

సాగు విస్తీర్ణం 10 వేల ఎకరాలు

మండలంలో 10,864 ఎకరాల్లో ఏటా వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వరినాట్లు వేసే ప్రక్రియ ఆలస్యమైంది. మండంలోని పల్లపు ప్రాంతాల్లో వరినాట్లు గత వారం నుంచి ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం జోరందుకున్నారు. ఇప్పటి వరకు మండలంలోని 1,465 ఎకరాల్లో పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. సెప్టెంబర్ 15లోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశాలు. ఈ-క్రాప్ పూర్తయితే మండలంలోని 11,283 మంది రైతులకు భరోసా దక్కనుంది.



ఈ-క్రాప్ నమోదులో వ్యవసాయ అధికారులు

వివరాల నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

రైతులకు ఈ-క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలు తెలిసేలా వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో సమావేశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పంట నమోదు ద్వారా వరదలు, తుపాను వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చి, పంట నష్టం జరిగితే పంటల బీమా వర్తిస్తుంది. సాగులో ఉన్న పంటల వారీగా ప్రభుత్వం ప్రకటించే పరిహారం రైతుల బ్యాంకు ఖాతాలకే నేరుగా జమ అవుతుంది. తక్కువ ధరకే మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణీకే ఇదే ప్రధాన ఆధారం.

మరోవైపు రైతులు ఏయే ప్రాంతాల్లో ఏయే పంటల్ని, ఎంత విస్తీర్ణంలో సాగుచేస్తున్నారన్న వివరాలపై ప్రభుత్వానికి స్పష్టత ఉంటుంది. దీంతో పంట దిగుబడి అంచనా, మార్కెటింగ్ సౌకర్యాలు, పంట మార్పిడి విధానాలపై ముందుజాగ్రత్త చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది.

నష్ట పరిహారం ఖాతాలో జమ



పంట సాగు వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవడం వల్లనే గత ఏడాది పంట నష్ట పరిహారాన్ని పొందగలిగాం. పరిహారం నేరుగా నా బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. ఈ-క్రాప్ వల్ల ప్రయోజనమేంటో నాకు తెలిసొచ్చింది. ఈ ఏడాది కూడా ఈ-క్రాప్ నమోదు చేయించుకున్నాను. వ్యవసాయ సిబ్బంది నేరుగా పంటల వద్దకే వచ్చి ఈ-క్రాప్ చేస్తున్నారు. ఈ-క్రాప్‌తో రైతులకు ధైర్యం పెరిగింది.

–దాసరి గోపాల్, రైతు, తగరంపూడి

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులు తమ పంటల సాగు వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వం అందించే అన్ని పథకాలకూ అర్హులవుతారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వరినాట్లు ఇంకా పూర్తికాలేదు. మిగిలిన పంటలతో పాటు, నాట్లు జరిగిన వరి పొలాల్లో జియో ఫెన్సింగ్ ద్వారా ఈ-క్రాప్ చేపడుతున్నాం. ఖరీఫ్‌లో పంటసాగు చేస్తున్న ప్రతి రైతు ఆర్బీకేలో వివరాలను నమోదు చేసుకోవాలి.

–పీయూటీపీ రంగాచారి, వ్యవసాయ అధికారి, అనకాపల్లి మండలం

మణిపూర్ హింసకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో క్రైస్తవ, ప్రజా సంఘాల ప్రతినిధులు



వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

కశింకోట: మణిపూర్‌లో జరిగిన మారణకాండను నిరసిస్తూ మంగళవారం కశింకోటలో పలు క్రైస్తవ, ప్రజా సంఘాలు, ఐద్వా, మహిళా సంఘాలు, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, దళిత సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. మూడున్నర నెలలుగా మణిపూర్‌లో సాగుతున్న హింసకు ప్రధాన కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో మత సామరస్యం, ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని కోరారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి హత మార్చిన దుర్మార్గులను తక్షణమే చట్టపరంగా శిక్షించాలన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. మణిపూర్‌లో దుర్మార్గుల విధ్వంసానికి గురైన చర్చిలను, గృహాలను ప్రభుత్వమే పునర్నిర్మించాలన్నారు. మైనార్టీ క్రైస్తవులుగా ఉన్న కుకీలను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్‌లలో వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.బెనర్జీకుమార్, కార్యదర్శి కె.ప్రేమ్‌కుమార్, సీఐటీ యూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా నాయకుడు రాజాన దొరబాబు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, దళిత సంఘ నాయకుడు పావాడ కామరాజు, పాస్టర్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

8 మందికి ఐవోఎల్ కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేయించుకున్న రోగులతో రోటరీ క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మంది రోగులకు ఐవోఎల్ శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆస్పత్రి వైద్యుడు కె.మల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆస్పత్రి ఆవరణలో ఆయన మాట్లాడుతూ 35 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించగా, 8 మందికి శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. వీరు మూడు రోజులు ఆస్పత్రిలోనే ఉంటారని, వారికి ఉచితంగా మందులు, భోజన వసతి కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సహాయకురాలు పి.దేవి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సంఘాల ఆర్థిక నిర్వహణపై వీవోఏలకు శిక్షణ



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం కొండమ్మ

మునగపాక : డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెలుగు ఏపీఎం కొండమ్మ పిలుపునిచ్చారు. మునగపాకలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘాల వీవోఏలకు సంఘాల ఆర్థిక నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు, అప్పులు చెల్లించడంపై ప్రణాళిక తయారు చేసుకోవడంతో పాటు సామాజిక, ఆర్థిక కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అకౌంటింగ్ విధానంపై కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. లీగల్ కో-ఆర్డినేటర్ సీసీ శ్రీనివాస్, ఎఫ్‌పీవో సీసీ దేవానంద్, మండల సమాఖ్య అధ్యక్షులు రేవతి, కార్యదర్శి మరిడమ్మ, పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

కస్పావీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం



కాంక్రీట్ మిక్సర్‌తో వేస్తున్న సిమెంట్ రోడ్డు

కశింకోట: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన నిధులతో స్థానిక కస్పావీధి నుంచి కుమ్మరి వీధి వరకు సిమెంట్ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. గ్రామంలో అభివృద్ధి పనుల్ని శరవేగంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో కాంక్రీట్ మిక్సర్‌ను తీసుకొచ్చారు. దీని సాయంతో రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి కాగలవని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



ఉత్తమ పురస్కారాలు అందుకున్న అధికారులను సత్కరిస్తున్న నాయకులు, ఉద్యోగులు

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వెంకటాపురం సర్పంచ్ సుందరపు నీలకంఠస్వామి (తాతాజీ) అన్నారు. వెంకటాపురం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కర్రి త్రినాథ్, ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఆకలి గంగాభవాని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విషయం తెలిసిందే. ఆయా ఉద్యోగులను మంగళవారం సచివాలయంలో సత్కరించారు. ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సాయివజ్రం, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, పాలసంఘ అధ్యక్షుడు కాసులుబాబు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

మునగపాక : నాగులాపల్లిలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా ఐటీ విభాగం కన్వీనర్ మళ్ల కాళేశ్వరరావు తెలిపారు. ఉదయం 9 గంటలకు పంచాయతీ కార్యాలయం దరి రాజరాజేశ్వరి స్టేజిపై శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

భారీ వర్షానికి రోడ్లు జలమయం



ప్రధాన రహదారిలో భారీగా నిలిచిన వర్షపు నీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

సబ్బవరం: సబ్బవరం మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో సబ్బవరం పోలీస్ స్టేషన్‌తో పాటు ఆనుకుని ఉన్న ప్రధాన రహదారి జలమయం అయింది. ఇటీవల ప్రధాన రహదారిని అభివృద్ధి చేసినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైన్లు పూర్తి చేయలేదు. మరో వైపు డ్రైన్‌లలో పూడిక తొలగించకపోవడంతో ఈ ప్రాంతం తరుచూ ముంపునకు గురవుతోంది. పోలీస్‌స్టేషన్ నుంచి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న సాయినగర్ నుంచి వర్షపు నీరు రోడ్డు పొడవునా ప్రవహించి ఇక్కడకు చేరడంతో ఈ ప్రాంతంలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. సబ్బవరం పోలీస్ స్టేషన్ ముంపునకు గురికావడంతో పాటు ప్రధాన రహదారిలో వాహనాలు రాకపోకలకు సైతం తీవ్ర అంతరాయం కలిగింది.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

బావ అదృశ్యంపై బావమరిది ఫిర్యాదు

అనకాపల్లిటౌన్: తన బావ చిత్తూరు రామకృష్ణ కనిపించడం లేదంటూ పట్టణ పోలీసులకు మంగళవారం అతని బావమరిది ఎం.సంతోష్ ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ దాడి మోహన్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16న అనకాపల్లి జాతీయరహదారిపై కాకినాడకు చెందిన లారీ డ్రైవర్ చిత్తూరు రామకృష్ణ ఓ వ్యాన్‌ను ఢీకొన్నాడు. దీంతో భయపడి లారీని అక్కడే వదిలి పరారయ్యాడు. ఎంతకీ తిరిగి రాకపోవడం, ఎలాంటి సమాచారం లేకపోవడంతో అతని అదృశ్యంపై సంతోష్ తాజాగా పోలీసులను ఆశ్రయించారు. అప్పటి నుంచి తామెన్ని ప్రయత్నాలున చేసినా ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులకు తెలిపారు. బావమరిది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు



సచివాలయంలో నూతన పింఛనుకు ఎంపికైన వారితో మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం : ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఎంపీడీవో రామచంద్రమూర్తి అన్నారు. తిమ్మాపురం పెదగుమ్ములూరు గ్రామాల్లో మంగళవారం నూతనంగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులను గుర్తించి వివరాలు తెలుసుకునేందుకు సచివాలయాల్లో దరఖాస్తుదారులతో సమావేశమయ్యారు. దరఖాస్తుదారుల అర్హత గుర్తించి ఆమోదించారు. పార్టీలకతీతంగా అర్హులను గుర్తించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల్లో అధికార పార్టీవారికే మొదటి ప్రాధాన్యం ఇచ్చేవారని, ప్రస్తుతం సీఎం జగన్ మోహన్‌రెడ్డి అర్హుల అందరికీ పింఛను, ఇతర పథకాలు అందివ్వడం అభినందనీయమన్నారు. సమావేశంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం



మరిడిమాంబ అమ్మవారి సన్నిధిలో భక్తులు

తుమ్మపాల: అనకాపల్లి మండలం కాపుశెట్టివానిపాలెం శ్రీ మరిడిమాంబ అమ్మవారి దేవాలయ మొదటి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి, అమ్మవారికి పూజలు జరిపి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

తిరుమల పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పాదయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి నుంచి తిరుమలకు దసరా నవరాత్రుల తర్వాత పాదయాత్ర చేసేందుకు ఆసక్తి గల భక్తులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు తెలిపారు. మంగళవారం తన స్వగృహంలో పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పార్టీ నాయకుల ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల తర్వాత పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. పాదయాత్ర కన్వీనర్ బుద్ధ మోహన్ మాట్లాడుతూ అనకాపల్లి నుంచి తిరుమల కొండపైకి సుమారు 800 కిలోమీటర్లు ఉంటుందని, రోజుకు 25 కిలో మీటర్లు చొప్పున ఈ పాదయాత్ర సాగుతుందన్నారు. పాదయాత్రకి ప్రస్తుతం 20 మంది పేర్లను నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైన పాదయాత్ర ద్వారా తిరుమల రావాలనుకుంటే 9912890110 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పాదయాత్ర నిర్వాహక సభ్యులు బి.నాగేంద్ర, యల్లపు వెంకట రమణాజీ, సూర్యం పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయానికి డస్ట్‌బిన్‌ల అందజేత



ఆలయ కమిటీ ప్రతినిధులకు డస్ట్‌బిన్‌లు అందిస్తున్న ఆడారి కుమారస్వామి దంపతులు

అనకాపల్లి రూరల్: సత్యనారాయణపురం కనకదుర్గ అమ్మవారి ఆలయానికి మంగళవారం వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జన కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి దంపతులు డస్ట్‌బిన్‌లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా నవరాత్రుల్లో ఏటా అమ్మవారి ఆలయానికి అవసరమైన డస్ట్‌బిన్‌లు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రావణమాసంలో కూడా అమ్మవారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నందున, పారిశుధ్య సమస్య రాకూడదన్న ఉద్దేశంతో వీటిని అందించినట్లు పేర్కొన్నారు. దాతలకు ఆలయ కమిటీ ప్రతినిధులు కతజ్ఞతలు తెలిపారు. కుమారస్వామి దంపతులను దేవాలయ కమిటీ చైర్మన్ బోయిన రమణాజీ దుశ్శాలువతో సత్కరించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. అర్చకులు రేజేటి ధర్మాచార్యులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి రూరల్: నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ ప్లీనం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకూ దేశ వ్యాప్తంగా ధరల పెరుగుదల, నిరుద్యోగం, మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకించాలని వక్తలు పిలుపునిచ్చారు. రాష్ట్రాల హక్కులను హరిస్తోన్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా ప్రజలంతా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అంతకు ముందు ప్లీనం సమావేశాలను పార్టీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, బి.ప్రభావతి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయండి

'టిడ్కో' అధికారులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

పరవాడ: గొర్లివానిపాలెం సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కాలనీలో అసంపూర్తి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద గల టిడ్కో ఇళ్ల కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ మంజూరు చేసిన 512 టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయినట్లు వెల్లడించారు. వీటిలో 500 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేశామన్నారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సదుపాయాలను కల్పించామన్నారు. సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే 10 కల్లా పూర్తి చేసి ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్‌ను ఆదేశించారు. జెడ్పీ సింహాచలం, ఏపీడీ రాము, సీఎల్‌టీసీ దేముడుబాబు, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హరిపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగాధిపతి లచ్చన్న మంగళవారం సందర్శించారు. వరి దుబ్బులు వేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఎక్కువ దిగుబడి పొందేందుకు గల మెలకువలను రైతులకు వివరించారు. జిల్లా కో-ఆర్డినేటర్ గోవింద్, ఇన్‌ఛార్జ్ నాయుడుబాబు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందిస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల: మండలంలోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కోరినట్టు జెడ్పీటీసీ సభ్యురాలు సిద్ధాబత్తుల ఉమాదేవి తెలిపారు. విశాఖలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మండలానికి సంబంధించి పలు అంశాలను జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వివరించారు. అణుకు గిరిజన గ్రామానికి రోడ్డు వేయాలని, గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం ఏర్పాటు చేయాలని, ఆశ కార్యకర్తలను నియమించాలని కోరగా అంగన్‌వాడీ భవనం, ఆశ కార్యకర్త ఏర్పాటుకు జెడ్పీ చైర్‌పర్సన్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న సీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని, వెల్‌నెస్ సెంటర్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, కైలాసపట్నంలోని కమ్యూనిటీ హాలు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com